క్లుప్తంగా

దోమలు పుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



నీటి నిల్వలు పరిశీలిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): దోమలు పుట్టకుండా... కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం రోజా వీధిలోని యూపీహెచ్‌సీ పరిధిలో ఉన్న కారల్‌మార్క్స్ నగర్‌లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడేలో భాగంగా ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు ఇంటింటికి తిరిగి దోమలు పుట్టకూడదు...దోమలు కుట్టకూడదనే నినాదంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎవ్వరికైనా జ్వరలక్షణాలు ఉంటే వారికి నిర్ధారణ పరీక్షలు చేసి తగు చికిత్సలు ఇవ్వాలని ఆదేశించారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ ఫాతిమా, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

అర్హులైన వృత్తిదారులను ఎంపిక చేయండి

కర్నూలు(సెంట్రల్) : గ్రామీణ ప్రాంతాల్లోని సంప్రదాయ కుల వృత్తిదారులు, హస్త కళాకారులను పీఎం విశ్వకర్మ యోజన పథకానికి అర్హులుగా ఎంపిక చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. శుక్రవారం ఆమె జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా స్థాయి అమలు కమిటీ సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 17వ తేదీన పీఎం విశ్వ కర్మ యోజన పథకం ప్రారంభమవుతుందన్నారు. ఈ పథకంపై పెద్ద ఎత్తున ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం ప్రసాదు, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ పాల్గొన్నారు.

డాక్టర్ చంద్రశేఖర్‌కు ఘన సన్మానం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కార్డియాలజిస్టుగా పనిచేసి పదవీ విరమణ చేసిన డాక్టర్ పి.చంద్రశేఖర్‌ను శుక్రవారం బీసీ నాయకులు ఘనంగా సన్మానించారు. కళాశాల ప్రిన్సిపల్‌గా, ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా, కార్డియాలజి హెచ్‌ఓడిగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. కర్నూలు హెల్త్ క్లబ్ ఏర్పాటు చేసి ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య, శ్రీనివాసులు, శ్రీరాములు యాదవ్, కృష్ణోజి రావు, కుర్వ వెంకటక్రిష్ణ, బెస్త శ్రీరాములు, వడ్డెర లక్ష్మన్న, రఘుయాదవ్ పాల్గొన్నారు.

కార్పొరేట్ల కొమ్ముకాస్తున్న మోదీ

కర్నూలు(సెంట్రల్): ప్రధాని నరేంద్రమోదీ కార్పొరేట్‌ల కొమ్ము కాస్తూ పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. శుక్రవారం సీపీఐ చేపట్టిన బస్సుయాత్ర కర్నూలుకు చేరుకుంది. మొదట నంద్యాల చెక్‌పోస్టు నుంచి పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగసభలో రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్రకార్యవర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓబులేషు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జాన్సన్, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

శంకరాస్‌లో జాబ్ మేళా

కర్నూలు సిటీ: ఏపీ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖల ఆధ్వర్యంలో శ్రీశంకరాస్ డిగ్రీ కాలేజీలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. ఎస్‌వీసీ సినిమాస్, ఆరోర్ ఫార్మా కంపెనీ, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలు హాజరైన ఈ మేళాలో మొత్తం 151 మంది నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొన్నట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. వివిధ ఉద్యోగాలకు 56 మంది ఎంపికయ్యారని వెల్లడించారు. కార్యక్రమంలో ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌లు, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆఫీసర్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

3న ఆల్ జమాత్



సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(సెంట్రల్) : సెప్టెంబర్ మూడో తేదీన ఆల్ జమాత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ చెప్పారు. మారుతున్న దేశ స్థితిగతులు..మన బాధ్యత అనే అంశంపై నిర్వహించే ఈ అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా అంతర్జాతీయ ఇస్లామిక్ లా ఎక్స్‌పర్ట్ ఖాలీద్ సైపుల్లారహమాని హాజరవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి సంబంధించి మునిసిపల్ హైస్కూలులో చేపట్టిన సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే ముస్లిం మతపెద్దలతో కలసి శుక్రవారం పరిశీలించారు.

ఆనందమని 'పింఛన్'

వృద్ధాప్యంలో ఆసరా



ఈమె పేరు ఫాతీమాబీ. మద్దూరునగర్‌లో నివసిస్తుంది. 61వ సచివాలయం పరిధిలో నివసించే ఈమె వృద్ధాప్య పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకుంది. ఇటీవలే అమెకు సర్కారు పెన్షన్ మంజూరు చేసింది. శుక్రవారం వలంటీర్ విజయ్ నుంచి అమె రూ.2,750 పెన్షన్ అందుకుంది. తొలిసారి పెన్షన్ సొమ్ము అందుకున్న ఆమె ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ప్రభుత్వం పేదల మీద చూపిస్తున్న ప్రేమ ఎన్నటికి మరువం. వృద్ధాప్యంలో ఉన్న తనకు మంజూరైన పెన్షన్ ఎంతో ఉపయోగపడుతుందని సంతోషం వ్యక్తం చేశారు.

పైసా ఖర్చులేకుండా..



శ్రీరామ్‌నగర్‌కు చెందిన ఈమె పేరు అంకమ్మ. సచివాలయం 62 పరిధిలో ఉంటున్నారు. వృద్ధురాలు అయిన ఈమె పెన్షన్‌కు అర్హురాలు. వలంటీర్ శివలక్ష్మి గుర్తించి ఆమె నుంచి వివిధ ధ్రువీకరణ పత్రాలు తీసుకుని పెన్షన్‌కు దరఖాస్తు చేసింది. ఆగస్టు నెలలో సర్కారు పెన్షన్ మంజూరు చేసింది. శుక్రవారం ఇంటి వద్దకు వెళ్లి వలంటీర్ పెన్షన్ సొమ్ము అందజేశారు. పైసా ఖర్చు లేకుండా, ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిప్పుకోకుండా తనకు సర్కారు పెన్షన్ మంజూరు చేయడం సంతోషంగా ఉందని చెప్పారు.

- ప్రతి ఏటా రెండు విడతల్లో వైఎస్సార్ ఆసరా పెన్షన్ల మంజూరు
- నాలుగు విడతల్లో నగరంలో 4, 273 కొత్త పెన్షన్లు
- అవ్వాతాతల మోముల్లో ఆనందం
- ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్న లబ్ధిదారులు
- అర్హత ఉంటే చాలు పెన్షన్లు మంజూరు
- నగర పాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్

జీవితంపై భరోసా



ఈ చిత్రంలో పింఛన్ తీసుకుంటున్న దివ్యాంగుడి పేరు వి.అల్లీపీరయ్య. 72 వ సచివాలయం రామచంద్రనగర్‌లో నివసిస్తున్నాడు. వయస్సు 57 సంవత్సరాలు. గతంలో దరఖాస్తు చేసుకుంటే వివిధ కారణాలు చూపిస్తూ పెన్షన్ మంజూరు చేయలేదు. నెలన్నర రోజుల క్రితం కొత్తగా వికలాంగుడి పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ప్రభుత్వం పరిశీలించి పెన్షన్ మంజూరు చేసింది. శుక్రవారం ఉదయాన్నే 7 గంటలకు సచివాలయ సిబ్బంది రూ. 3 వేలు చేతిలో పెట్టడంతో ఆయన సంతోషానికి హద్దులు లేవు. పెన్షన్ మంజూరుతో జీవితంపై భరోసా కలిగిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కర్నూలు (టౌన్) : నాలుగేళ్ల క్రితం పెన్షన్ మంజూరు కావాలంటే ఎన్నో వ్యయప్రయాసలు. దరఖాస్తు మొదలు మంజూరు వరకు ఇదే పరిస్థితి. వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పెన్షన్ల మంజూరులో పూర్తి స్థాయిలో మార్పులు తీసుకువచ్చింది. సామాజిక పెన్షన్లకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. దరఖాస్తు చేసుకున్న వెంటనే అర్హులని తెలితే చాలు మంజూరు చేస్తున్నారు. ఇందుకోసం ఎక్కడెక్కడో తిరగాల్సిన పని లేదు. ఇంటి సమీపంలోని సచివాలయంలో సంప్రదిస్తే చాలు పెన్షన్ మంజూరవుతోంది.

తంఛన్‌గా పెన్షన్....

ఇక పెన్షన్ పంపిణీలోనూ ప్రభుత్వం అనేక మార్పులు తీసుకువచ్చింది. ప్రతినెల ఒకటో తేది ఉదయం ఇంటి వద్దకే వలంటీర్ వెళ్లి పెన్షన్ సొమ్ము అందజేస్తున్నాడు. గతంలో రోజుల తరబడి పెన్షన్ తీసుకునేందుకు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఎవరైనా పెన్షన్‌దారుడు అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉంటే అక్కడికి వెళ్లి పెన్షన్లు అందిస్తున్నారు. కరోనాతో బయటకు వెళ్ల లేని పరిస్థితి ఉన్నప్పుడు సైతం వలంటీర్లు ఇంటి తలుపు తట్టి పెన్షన్ అందించారు. ఈప్రక్రియ నాలుగున్నరేళ్లుగా నిరాటకంగా కొనసాగుతుంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇంటి వద్దకే పెన్షన్ వస్తుండటంతో పెన్షన్‌దారుల్లో ఆనందం వ్యక్తమవుతుంది.

నాలుగు విడతల్లో 4,273 పెన్షన్లు

ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందజేస్తోంది. ఇప్పటి వరకు నాలుగు విడతలుగా పెన్షన్లు మంజూరు చేసింది. 2022 సంవత్సరంలో పెన్షన్ దరఖాస్తులు అధికంగా రావడంతో అదే ఏడాదిలో జూన్‌లో ఒకసారి డిసెంబర్‌లో మరోసారి కొత్త పెన్షన్లు మంజూరు చేసింది. తాజాగా 1,016 పెన్షన్లు మంజూరు చేసింది. మొత్తంగా నగరపాలక పరిధిలో నాలుగు విడతల్లో 4, 273 పెన్షన్లు కొత్తగా మంజూరు చేసింది. ప్రస్తుతం నగరంలో మొత్తం 33,177 పెన్షన్‌దారులున్నారు. వీరికి ప్రతినెల పంపిణీ కోసం ప్రభుత్వం రూ.9,33,38,750 విడుదల చేస్తోంది.

కొత్తగా 1,016 పెన్షన్లు మంజూరు

నగరపాలక సంస్థకు కొత్తగా మరో 1,016 పెన్షన్లు మంజూరు అయ్యాయి. ప్రతి సంవత్సరం సచివాలయాల పరిధిలో పెన్షన్‌కు అర్హులైన వారిని గుర్తించి వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేయిస్తున్నాం. ఈ సారి కొత్తగా 1,016 పెన్షన్లు మంజూరయ్యాయి. వారందరికీ ప్రస్తుతం పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే వెంటనే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం పరిశీలించి మంజూరు చేస్తుంది.

– రామలింగేశ్వర్, కర్నూలు నగరపాలక అడిషనల్ కమిషనర్

అర్హులందరికీ పెన్షన్లు



పెన్షన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(సెంట్రల్): అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేస్తున్నట్లు కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో నూతనంగా పెన్షన్‌లు మంజూరైన వారికి అందజేశారు.కార్యక్రమంలో కార్పొరేటర్ షాషావలి, కో ఆప్షన్‌మెంబర్ శ్రీరాములు, 3వ వార్డు ఇన్‌చార్జ్ ఖా దర్‌బాషా,52వవార్డు ఇన్‌చార్జ్ మహేష్ పాల్గొన్నారు.

ఆసుపత్రిలో రోగికి పెన్షన్ అందజేత



ఆసుపత్రిలో పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ మహ్మద్‌గౌస్, సచివాలయ కన్వీనర్ ఇంతియాజ్

కర్నూలు(సెంట్రల్) : కర్నూలు నగరంలోని 4వ వార్డు 10వ సచివాలయం పరిధిలో నివాసం ఉంటున్న రాఘవేంద్రకుమార్ అనే వ్యక్తి ఓమ్ని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన పెన్షన్‌దారుడు కావడంతో వలంటీర్ మహ్మద్‌గౌస్, సచివాలయ కన్వీనర్ ఇంతియాజ్ శుక్రవారం ఉదయం ఆసుపత్రికి వెళ్లి పెన్షన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య వృత్తి ఎంతో గొప్పది



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో వైద్యవృత్తికి ఎంతో విలువ ఉందని, దానిని కాపాడుకునే విధంగా ఎంబీబీఎస్ నుంచే వైద్య విద్యార్థులు మెలకువలు నేర్చుకోవాలని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ చెప్పారు. కర్నూలు మెడికల్ కాలేజిలో కొత్తగా చేరిన 2023–24 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులకు శుక్రవారం న్యూ లెక్చరర్ గ్యాలరీలో ఓరియంటేషన్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పి. సుధాకర్ మాట్లాడుతూ కళాశాల ఆవిర్భావం, ప్రారంభమైన సీట్లు, బ్రాంచిలు, ప్రస్తుత అభివృద్ధి గురించి వివరించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వారి పాత్రలు, బాధ్యతలు గురించి వివరించారు. వైద్య విద్య ఎంతో ఉన్నతమైనదని, ప్రారంభం నుంచే క్రమశిక్షణతో చదవాలన్నారు. అనంతరం ఇండియన్ మెడికల్ గ్రాడ్యుయేట్, సీబీఎంఈ పాఠ్యాంశాల విజన్, మిషన్ గురించి వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినర్సమ్మ, డాక్టర్ రేణుకాదేవి,డాక్టర్ సాయిసుధీ ర్ వివరించారు. ఫౌండేషన్ కోర్సుల గురించి డాక్టర్ సింధియా, డాక్టర్ ఉమామహేశ్వరి ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, హెచ్‌ఓడిలు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ తనిఖీ

కర్నూలు కల్చరల్: ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు శుక్రవారం కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్గో, పార్సెల్ బుకింగ్స్, డెలివరీ వివరాలను పరిశీలించారు. అనంతరం బస్టాండ్‌లోని స్టాల్స్‌ను పరిశీలించి నిర్ణీత ధరల కన్నా ఎక్కువకు వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట కర్నూలు ప్రాంతీయ అధికారి వెంకట రామం, నంద్యాల ప్రజా రవాణాధికారి శ్రీనివాసులు, కర్నూలు, నంద్యాల జిల్లాల డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ రజియా సుల్తానా, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ వెంకటరమణ, కర్నూలు–2 డిపో మేనేజర్ సర్దార్‌హుసేన్ , తదితరులు ఉన్నారు.

మైనర్ డ్రైవింగ్‌కు భారీ జరిమానా



స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన మైనర్లకు, వారి తల్లి దండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ

కర్నూలు : రోడ్డు ప్రమాదాల నివారణకు నగరంలో కొంతకాలంగా మైనర్ డ్రైవింగ్‌పై ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నప్పటికీ విద్యార్థుల్లో మార్పు రాకపోవడంతో పంథా మార్చారు. ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో వాహనాలను సీజ్ చేసి రవాణా శాఖ అధికారులకు అప్పగిస్తున్నారు. గత నెల 29వ తేదీన పట్టుబడిన 15 వాహనాలను రవాణా శాఖకు అప్పగించగా ఒక్కొక్క వాహనానికి రూ.12 వేల నుంచి రూ.13,525 దాకా జరిమానా విధించారు. అలాగే 28వ తేదీ 25 వాహనాలు పట్టుబడగా ఆర్టీవో అధికారులు ఒక్కొక్క వాహనానికి రూ.11 వేల నుంచి రూ.12 వేలు జరిమానా విధించారు.అలాగే శుక్రవారం కూడా నగరంలోని రాజ్‌విహార్, సి.క్యాంప్, ఓల్డ్ ఈద్గా, ఫైవ్ రోడ్ జంక్షన్లలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్ లేకుండా త్రిబుల్ రైడింగ్‌లో వెళ్తున్న ఆరుగురు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వాహనాలను కూడా కొత్తపేటలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు.

నగరాభివృద్ధికి ప్రాధాన్యత

కల్లూరు: నగరంలో అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 28వ వార్డు దూపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి బుక్‌లెట్లు అందజేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించడానికే ప్రజా ప్రతినిధులందరం గడప గడపకు వస్తున్నామని ఏవైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సకాలంలో తెలియజేస్తున్నారా? లేదా ? అని ఆరా తీశారు. గ్రామస్తులు రోడ్లు, డ్రైనేజీ కాలువలతో పాటు పలు సమస్యలు ఎమ్మెల్యేకు తెలియజేయగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తున్నారన్నారు. పథకాల ఎంపికల్లో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హతను ప్రామాణికంగా తీసుకుంటున్నారన్నారు. కరోనా మహమ్మారి ప్రభావంతో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగా లేకునా పేదల అభ్యున్నతి కోసం పథకాలు కొనసాగించిన ఘనత సీఎం జగనన్నకు దక్కుతుందన్నారు. గత టీడీపీ పాలనలో ప్రభుత్వ పథకాలు పొందలంటే జన్మభూమి కమిటీల సిఫారసులతో పాటు నాయకుల అండదండలు ఉండాలన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని చెప్పారు. జనరంజక పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్పొరేటర్లు నారాయణరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, లక్ష్మీరెడ్డి, శ్వేతారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, కేశవరెడ్డి, ఎ.హనుమంతురెడ్డి, పాల్గొన్నారు.



జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్ అబ్దుల్‌నజీర్‌ను కర్నూలు పోలీసు గెస్ట్ హౌస్‌లో మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

సాక్షి ఫొటో గ్రాఫర్, కర్నూలు

అవీ ఇవీ

6 నుంచి శ్రీ వ్యాస పూజ మహోత్సవాలు

కర్నూలు కల్చరల్: ఈనెల 6, 7, 8 తేదీల్లో స్థానిక ఇస్కాన్ జగన్నాథ మందిరంలో శ్రీల ప్రభుపాదుల 127వ శ్రీ వ్యాస పూజ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ చైతన్య ప్రభు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నిత్యావసర ధరలు తగ్గించాలి

కర్నూలు(సెంట్రల్): పెంచిన నిత్యావసరాలు, కరెంట్, బస్సు చార్జీలు, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం 58, 59 సచివాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు.

అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించండి

కర్నూలు(అర్బన్): ప్రజా రవాణా సంస్థలో అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టర్ల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఏపీఎస్ఆర్‌టీసీ అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వాడాల నాగరాజు కోరారు. శుక్రవారం ఇక్కడకు వచ్చిన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమల రావును ఆయన కలిసి వినతి పత్రం అందించారు.

ఆర్‌యూలో హాస్టల్ సిబ్బందిపై వేటు

కర్నూలు(న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం బాయ్స్ హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్న స్టీవార్డెన్ బి.ముని రమేష్, స్టోర్ కీపర్ ఈ.రవికుమార్‌పై వేటు వేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ రికార్డులు సక్రమంగా రాయడం లేదని విచారణలో తెలడంతో వారిని తొలగిస్తూ చర్యలు తీసుకున్నట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు.

టీడీపీ కుట్రలను తిప్పికొడదాం

కల్లూరు: రాష్ట్రంలో టీడీపీ చేస్తున్న కుట్రలను తిప్పి కొడద్దామని కల్లూరు అర్బన్ జేసీఎస్ కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 26వ వార్డులోని కృష్ణానగర్‌లో వార్డు సచివాలయ కన్వీనర్ల, గృహసారథులతో స్థానిక కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి అధ్యక్షతన బీమా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

15లోపు ఈ–క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఈ–క్రాప్ బుకింగ్‌ను ఈనెల 15లోపు పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, మండల స్థాయి అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ–క్రాప్ బుకింగ్‌కు సంబంధించి ఆదోని, కోసిగి, ఆలూరు, తుగ్గలి, వెల్దుర్తి మండలాల్లో పురోగతి తక్కువగా ఉందన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి అర్హులైన వారిని మాత్రమే గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, డీపీఓ నాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో లెక్చరర్ మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటరాముడు

కర్నూలు : కర్నూలు బళ్లారి చౌరస్తా సమీపంలోని దుర్గా లాడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీచైతన్య కళాశాల లెక్చరర్ వెంకటరాముడు (43) తీవ్ర గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక అర్ధరాత్రి మృతిచెందాడు. సి.బెళగల్‌కు చెందిన ఈయన కృష్ణారెడ్డి నగర్‌లో నివాసముంటాడు. గురువారం రాత్రి బైక్‌పై బళ్లారి చౌరస్తా నుంచి ఇంటికి వెళ్తుండగా దుర్గా లాడ్జి సమీపంలో లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా కోలుకోలేక అర్ధరాత్రి మృతిచెందాడు. భార్య సౌజన్యతో పాటు ఒక కూతురు సంతానం. తండ్రి రంగన్న ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి మార్చురీ కేంద్రంలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరుపుతున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో ట్రెజరీ ఉద్యోగి మరణం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న ఎన్.తిరుమలరావు(46) శుక్రవారం గుండెపోటుతో మరణించారు. కర్నూలు డాక్టర్స్ కాలనీలో నివాసం ఉంటున్న ఈయనకు ఆగస్టు 29న చాతిలో నొప్పిరావడంతో కుటుంబసభ్యులు వెంటనే గౌరి గోపాల్ హాస్పిటల్‌కు తరలించారు. కొద్ది రోజులుగా చికిత్స పొందుతున్నారు. గురువారం రాత్రి గుండెపోటు తీవ్రస్థాయిలో వచ్చింది. వైద్య సేవలు అందించినప్పటికీ కోలుకోలేక శుక్రవారం ఉదయం మరణించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తిరుమలరావు మృతిపై జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావు, ఏపీ ఎన్‌జీవో అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళరెడ్డి, ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, జిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘం నేతలు పలనాటి సునీల్, కరుణాకర్ తదితరులు తీవ్ర సంతాపం ప్రకటించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

నగరం మతసామరస్యానికి ప్రతీక



విగ్రహాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ

కర్నూలు కల్చరల్ : మత సామరస్యానికి కర్నూలు నగర ప్రతీక అని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఒకటో వార్డు ఖండేరిలోని రాఘవేంద్ర మఠం శ్రీ రాఘవేంద్రస్వామి వారి ఆరాధనను పురస్కరించుకుని ఎస్వీ మోహన్‌రెడ్డి స్వామివార్లను దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేస్తున్న 56 అడుగుల మట్టి వినాయక విగ్రహం తయారీని పరిశీలించారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, ఎస్వీ యూత్ పాల్గొన్నారు.

ఆసుపత్రి ఉద్యోగులు పనితీరు మార్చుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రి పరిపాలనా విభాగంలోని ఉద్యోగులు వారి పనితీరును మార్చుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన తన ఛాంబర్‌లో వివిధ కేటగిరీల ఉద్యోగుల పనితీరును సమీక్షించారు. మినిస్టీరియల్ ఉద్యోగులు, ఆసుపత్రి సిబ్బంది సమయపాలన, ఎఫ్ఆర్‌సీ, ఇతర వాటిపై ఆరా తీశారు. మెడికల్ అండ్ రికార్డు సెక్షన్‌లో రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సత్వరం రిపోర్టులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు. మినిస్టీరియల్ స్టాఫ్ సీట్ల మార్పు, ఇతర వాటిపై సమీక్షించారు. సమావేశంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు, అకౌంటెంట్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

క్రీడల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): ప్రతి విద్యార్థి తాను ఎంచుకున్న క్రీడలో సాధన చేసి రాణించాలని న్యాయవాది శ్రీధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిక పోటీల్లో రాణించిన క్రీడాకారులు ఈనెల 8,9 తేదీల్లో కావలిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా షూటింగ్ బాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్ నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు లోకేష్, మాధవి, దీప్తి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

భక్తి శ్రద్ధలతో శ్రావణ మాస పూజలు

కర్నూలు కల్చరల్: నగరంలోని అమ్మవారి ఆలయాల్లో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. బండి మెట్టలోని శ్రీ గంగ భవాని సమేత కేదారేశ్వర స్వామి ఆలయంలో గంగమ్మకు గాజులతో ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. సామూహిక కుంకుమార్చనలు, అర్చనలు నిర్వహించారు.

వాసవీ మాతకు 'దీప' పూజ

కర్నూలు కల్చరల్ : శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం కర్నూలు పూలబజార్ చిన్న అమ్మవారి శాలలో వాసవీ మాతకు ప్రత్యేక పూజలు, మంగళ హారతులు నిర్వహించారు. పలు రకాల పదార్థాలతో నైవేద్యం సమర్పించారు.

నోటీస్ బోర్డు

ఆర్‌యూ, ఉర్దూ వర్సిటీలకు పోస్టులు మంజూరు

కర్నూలు (న్యూసిటీ) : ప్రభుత్వం రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు చేపట్టింది. కర్నూలులోని రాయలసీమ, ఉర్దూ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను మంజూరు చేసిందని ఆయా వర్సిటీలు ఉపకులపతులు ఎ.ఆనందరావు, ఫజుర్ రహమాన్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. జీఓ ఎంఎస్ నంబర్ 68 ప్రకారం రాయలసీమ విశ్వవిద్యాలయానికి ప్రొఫెసర్ పోస్టులు 16, అసోసియేట్ 29, అసిస్టెంట్ 68 పోస్టులు, జీఓ ఎంఎస్ నంబర్ 72 మేరకు ఉర్దూ యూనివర్సిటీకి ప్రొఫెసర్ పోస్టులు 12, అసోసియేట్ 19, అసిస్టెంట్ 36 పోస్టుల మంజూరయ్యాయి. త్వరలో నోటిఫికేషన్ ద్వారా ఆయా పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనున్నట్లు వారు తెలిపారు.



